సాక్షి కరీంనగర్

గురువారం । 9 । మే । 2024

ప్రైవేట్ దోపిడీ షురూ

కార్పొరేట్.. ప్రయివేటు పాఠశాలల్లో
ఉత్తర్వులు బేఖాతరు
ముందస్తు ప్రవేశాల ప్రచారానికి రెడీ
చోద్యం చూస్తున్న విద్యాశాఖ

- వివరాలు IIలో

న్యూస్‌రీల్

మెరుగైన సేవలందించండి



కరీంనగర్‌టౌన్: అవసాన దశలో ఉన్న రోగులను గుర్తించి, ఆరోగ్యసేవలు అందించేందుకు పాలియేటివ్‌కేర్‌కు తరలించాలని డీఎంహెచ్‌వో సుజాత సూచించారు. బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆరోగ్యసేవలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని ప్రాథమిక, పట్టణ ఆరోగ్యకేంద్రాలు, ఆయుష్మాన్, ఆరోగ్య మందిర్ వైద్యాధికారులు సమగ్ర ప్రాథమిక ఆరోగ్యసేవలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆస్పత్రికి కూడా రాలేని రోగులకు ఇంటి వద్ద ఆలన సిబ్బందితో కూడిన మొబైల్‌వ్యాన్ ద్వారా ఆరోగ్యసేవలు అందించాలన్నారు. చెవి, ముక్కు, గొంతు, కంటి, పంటి సమస్యలు ఉన్న వారికి చికిత్స అందించడం లేదా జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేయాలని సూచించారు. శిక్షకులుగా డాక్టర్లు చిన్నికృష్ణ, పృథ్వీరెడ్డి, సందీప్, సన జవేరియా, శిల్పారెడ్డి వ్యవహరించారు.

డాక్టర్ శ్రవణ్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలి



కరీంనగర్‌టౌన్: జగిత్యాల జిల్లా కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు శ్రవణ్‌పై సస్పెన్షన్ ఎత్తివేసి, దాడికి పాల్పడిన వ్యక్తులపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని హెల్త్ కేర్ రిఫామ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్‌ఆర్‌డీఏ) జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బందారి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం కరీంనగర్ లోని మంచిర్యాల చౌరస్తాలో నిరసన చేపట్టారు. డాక్టర్ రాజకుమార్ మాట్లాడుతూ డాక్టర్లపై దాడులకు పాల్పడిన వారిపై 2008 సెక్షన్ కింద నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనను నేషనల్ మెడికల్ కౌన్సిల్, ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. హెచ్‌ఆర్‌డీఏ ప్రతినిధులు శరణ్‌సాయి, గౌతం, శేష శైలజ, చైతన్య రెడ్డి, శ్రీలక్ష్మి, రమణాచారి, విజయ మోహన్ రెడ్డి, రంజిత్, మహేష్, వెంకటేశ్వర్లు, చాట్ల శ్రీధర్ పాల్గొన్నారు.

'రాజ్యాంగ పరిరక్షణకు బీజేపీని ఓడించాలి'



చిగురుమామిడి: ప్రస్తుత పార్లమెంటు ఎన్నికలు కీలకమైనవని, భారత రాజ్యాంగ పరిరక్షణకు వామపక్ష ప్రజాతంత్ర శక్తులన్ని ఏకమై బీజేపీ, మిత్రపక్షాలను ఓడించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి తెలిపారు. సీపీఐ బలపర్చిన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు పక్షాన బుధవారం చిగురుమామిడిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పేదవర్గాలకు న్యాయం జరగాలంటే బీజేపీని ఓడించాలన్నారు. గడిచిన ఐదేళ్లలో కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ తెచ్చిన నిధులు ఎక్కడ ఖర్చు చేశారో వివరించాలని డిమాండ్ చేశారు. చిగురుమామిడి మండలంలో గత శాసనసభ ఎన్నికల్లో సీపీఐ బలపర్చిన ప్రస్తుత మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అత్యధిక మెజార్టీ వచ్చిందని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేయాలని కోరారు. సిద్దిపేట సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, గోలి బాపురెడ్డి, గూడెం లక్ష్మీ పాల్గొన్నారు.

చెరువుమట్టిని సద్వినియోగం చేసుకోవాలి



కరీంనగర్‌రూరల్: చెరువులోని పూడికమట్టిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో శ్రీధర్ కోరారు. బుధవారం కరీంనగర్ మండలం చేగుర్తిలో రైతుల పొలాలకు చెరువుమట్టి తరలించే కార్యక్రమాన్ని పరిశీలించారు. చెరువు మట్టి కోసం ఎంతమంది రైతులు దరఖాస్తు చేసుకున్నారని, రోజుకు ఎన్ని ట్రాక్టర్ల ట్రిప్పులు మట్టి రవాణా చేస్తున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. పూడికమట్టితో పొలాలు సారవంతంగా మారుతాయని, అవసరమున్న వారికి ఉచితంగా అందిస్తామని తెలిపారు. అనంతరం ఉపాధికూలీలను కలిసి తాగునీరు, నీడ సౌకర్యాలు ఎలా ఉన్నాయంటూ అడిగి తెలుసుకున్నారు. డీఆర్‌డీవో వెంట ఎంపీడీవో సంజీవరావు, ఏపీవో శోభారాణి పాల్గొన్నారు.



వేములవాడలో జరిగిన బహిరంగసభకు హాజరైన జనం



అభివాదం చేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ

కమలంలో హుషారు

- తన ప్రసంగంతో ఉత్సాహం నింపిన ప్రధాని మోదీ
- రాజన్నను దర్శించుకున్న తొలి ప్రధాని
- పోలీస్ వలయంలో ఆధ్యాత్మిక క్షేత్రం
- జనహోరుతో మారుమోగిన శైవక్షేత్ర పరిసరాలు
- బహిరంగసభకు భారీగా జనం హాజరు

వేములవాడ:

ఆధ్యాత్మిక క్షేత్రం వేములవాడ కాషాయమయమైంది. అడుగడుగునా పోలీసుల తనిఖీలు.. కమల దళం కవాతులతో మారుమోగింది. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ బుధవారం వేములవాడకు రాగా.. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలంతా చేరుకున్నారు. ముందుగా రాజన్నను దర్శించుకున్న మోదీ నేరుగా.. బహిరంగసభ వేదికపైకి వచ్చారు. తన ప్రసంగంతో కాషాయదళంలో హుషారు నింపారు. సమరోత్సాహంతో ముందుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. బీజేపీ కరీంనగర్, పెద్దపల్లి, ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ ముగ్గురికి ఓటేస్తే తనకు వేసినట్లేనని చెప్పారు. దీంతో బీజేపీ శ్రేణుల్లో జోష్ పెరిగింది. మోదీ ప్రసంగిస్తున్నంత సేపు వేదిక ప్రాంగణం మోదీ.. మోదీ.. అనే నినాదాలతో మారుమోగింది. పట్టణంలోని కూడళ్లు, బైపాస్‌రోడ్డు కాషాయజెండాలతో నిండిపోయింది.

పొద్దు పొద్దుగాల ఇంత జన ప్రవాహమా..

'వేములవాడ జనసభ' పేరుతో నిర్వహించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ బహిరంగ సభ విజయవంతమైంది. ఉదయం 10 గంటలకే బహిరంగసభకు భారీగా జనం తరలివచ్చారు. సరిగ్గా 10.30 గంటలకు సభ ప్రాంగణానికి మోదీ చేరుకుని.. జనసందోహాన్ని చూసి చలించిపోయారు. హెలికాప్టర్‌లో నుంచి జనప్రవాహాన్ని చూసిన మోదీ.. ఈ విషయాన్ని వేదికపై నుంచి ప్రస్తావించారు. 'నేను గుజరాత్‌లో మూడు సార్లు సీఎంగా పనిచేసిన. అక్కడ ఎన్నో ఎన్నికలు చూసిన. కానీ గుజరాత్‌లో కూడా పొద్దు పొద్దుగాల ఇంత పెద్ద జనసందోహాన్ని ఎన్నడూ చూడలేదు. కానీ ఇక్కడ ఇంత మంది తరలిరావడం... సభ బయట కూడా భారీగా జనం వస్తున్న దృశ్యాలను చూస్తుంటే... మీ అందరూ నాపై చూపుతున్న ప్రేమాభిమానానికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా..' అంటూ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ విజయం ముందే ఖాయమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అతి కష్టం మీద నిలబెట్టగా.. ఓటమి ఖాయమైందన్నారు. బీఆర్‌ఎస్ అడ్రస్ గల్లంతైందన్నారు.

రోడ్లు నిర్మానుష్యం

ప్రధాని నరేంద్రమోదీ పర్యటనతో పోలీసులు బందోబస్తులో భాగంగా వేములవాడ పట్టణంలోని దుకాణాలను మూసివేయించారు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. రోడ్లపై పోలీసులు, పోలీస్ వాహనాలు, భద్రత సిబ్బంది మినహా ఎవరూ కనిపించలేదు.

గాడిద గుడ్డు చూపుతున్నారు

ఆరు గ్యారంటీలను అడిగితే కాంగ్రెస్ నేతలు తెలంగాణ ప్రజలకు గాడిదగుడ్డు చూపిస్తున్నారని బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వలేదు, రూ.2లక్షల రైతుల రుణమాఫీ చేయలేదన్నారు. మోదీ ఏ పని చేపట్టినా వాళ్ల అమ్మ ఆశీస్సులు తీసుకుని బయటకొస్తారని.. ఇప్పుడు అమ్మ లేరు కాబట్టి మనమంతా మోదీ పక్షాన ఉంటూ మూడోసారి ప్రధానిని చేసుకుందామని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బండి సంజయ్



పెద్దపల్లి, కరీంనగర్, ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థులతో మోదీ, చిత్రంలో లక్ష్మణ్ ఉన్నారు

ఎలక్షన్ 2024



మోదీకి జ్ఞాపిక అందజేస్తున్న బీజేపీ లీడర్లు



వేదికపై ఎంపీ అభ్యర్థులు బండి సంజయ్ కుమార్, గోమాస శ్రీనివాస్, పార్టీ ముఖ్య నాయకులు

అధికారులు అలర్ట్‌గా ఉండాలి

- పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్

సాక్షిప్రతినిధి,కరీంనగర్: అకాల వర్షాలు కురిసే అవకాశముందని, అధికారులు అలర్ట్‌గా ఉండాలని పౌరసరఫరాలశాఖ కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ ఆదేశించారు. బుధవారం కొత్తపల్లి, గంగాధర, శంకరపట్నం మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ధాన్యానికి సంబంధించిన తేమశాతాన్ని పర్యవేక్షించారు. ఇప్పటివరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యం కేంద్రానికి వచ్చింది.. డబ్బులు రైతుల అకౌంట్లో జమ అయ్యాయా అని అధికారులను ఆరా తీశారు. ధాన్యం డబ్బులు సకాలంలో బ్యాంకుఖాతాలో జమవుతున్నాయా అని అక్కడికి వచ్చిన రైతులను అడిగి తెలుసుకున్నారు. మూడు, నాలుగు రోజుల్లోనే బ్యాంక్ ఖాతాలో జమవుతున్నాయని కమిషనర్‌కు రైతులు వివరించారు. రిజిస్టర్‌ను తనిఖీ చేసిన అనంతరం చౌహాన్ మాట్లాడుతూ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన ప్రతీ రైతుకు సంబంధించిన సెల్ నంబర్‌ను రిజిస్టర్‌లో తప్పక నమోదు చేయాలని ఆదేశించారు. తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలని సూచించారు. టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, సివిల్ సప్లై డీఎం రజినీకాంత్, ఇన్‌చార్జి డీఎస్‌వో సురేశ్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారి పద్మావతి, డీసీవో రామానుజచార్య, డీఆర్‌డీవో శ్రీధర్ పాల్గొన్నారు.



గంగాధరలో ధాన్యం పరిశీలిస్తున్న చౌహాన్

ప్రలోభాలపై పోలీసు నిఘా

- జిల్లాలో ఐదు చెక్‌పోస్టులు
- ఇప్పటి వరకు రూ.8.10కోట్లు పట్టివేత

కరీంనగర్‌క్రైం: ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల ప్రలోభాలపై పోలీసులు గట్టి నిఘా పెట్టారు. ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. నిరంతరం గస్తీ కాస్తున్నారు. జిల్లా సరిహద్దుల్లో ఐదు చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం, ప్రలోభాల ప్రభావాన్ని నివారించడానికి కృషి చేస్తున్నారు. పోలింగ్ సమీపిస్తుండడంతో మరింత దృష్టి పెంచారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ ప్రారంభమైనప్పటినుంచి ఇప్పటివరకు జిల్లాలో రూ.8.10కోట్లకు పైగా నగదు, 1,140 లీటర్ల మద్యం, 2.50కిలోల గంజాయి పట్టుకున్నారు. దీంతోపాటు అక్రమంగా డబ్బు, మద్యం, గంజాయి ఇతర వస్తువుల రవాణా అడ్డుకునేందుకు కరీంనగర్ బస్టాండు, రైల్వేస్టేషన్‌తో పాటు ఇతరప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎన్నికలు ముగిసే వరకు తనిఖీలు కొనసాగుతాయని సీపీ అభిషేక్ మహంతి వివరించారు. చెక్ పోస్టుల వద్ద పోలీసులు, కేంద్రబలగాలు, ఆర్టీఏ, ఎక్సైజ్‌శాఖల అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.



పట్టుకున్న నగదును చూపుతున్న టౌన్ ఏసీపీ(ఫైల్)

కేసీఆర్ రోడ్ షోను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే గంగుల కమలాకర్



కరీంనగర్: పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీంనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా గురువారం కరీంనగర్‌లో నిర్వహించే కేసీఆర్ రోడ్ షోను విజయవంతం చేయాలని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కోరారు. బుధవారం ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలతో సమీక్షించారు. రోడ్‌షో జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు. నియోజకవర్గ పరిధి నుంచి పెద్దఎత్తున ప్రజలు, కార్యకర్తలు రోడ్ షోకు హాజరయ్యేలా చూడాలని సూచించారు. ఎమ్మెల్సీలు ఎల్.రమణ, భాను ప్రసాద్‌రావు, మేయర్ యాదగిరి సునీల్‌రావు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, పెండ్యాల శ్యాం సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ గడువు పెంపు

కరీంనగర్ అర్బన్: ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల కమిషన్ మరో రెండు రోజుల గడువు పెంచిందని కలెక్టర్, ఎన్నికల అధికారి పమేలా సత్పతి తెలిపారు. ఈ నెల 10 వరకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని, ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులు అందరూ వినియోగించుకోవాలని సూచించారు.



- పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకనవుతా
- రూ.1,000 కోట్లతో స్మార్ట్‌సిటీ సాధించా
- జాతీయ రహదారుల కనెక్టివిటీ సెంటర్‌గా తీర్చిదిద్దాను..
- పార్లమెంట్‌లో అధిక ప్రశ్నలు వేసింది నేనే..
- కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి
- 'సాక్షి' ఇంటర్వ్యూలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

విజయం నాదే

ప్రజాసేవ చేయాలని రాజకీయాల్లోకి వచ్చా.. రాబోయే కాలంలోనూ సేవ చేయాలన్న భావన నాలో ఉంది.. గతంలో నన్ను ఎంపీగా గెలిపిస్తే రాష్ట్ర ప్రజల పక్షాన పార్లమెంట్‌లో గళం విప్పాను. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి.. అభివృద్ధి కావాలో.. విధ్వంసం కావాలో నిర్ణయించుకోవాలి.. కేసీఆర్ హయాంలో కరీంనగర్‌లో జరిగిన అభివృద్ధిని, 60 ఏళ్లలో గత పాలకులు చేసిన అభివృద్ధిని బేరీజు వేసుకొని, ఓటుతో తీర్పు చెప్పాలి.. రూ.1,000 కోట్లతో స్మార్ట్‌సిటీ సాధించి, హైదరాబాద్ తర్వాత కరీంనగర్‌ను రెండో అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దాను.. ఎన్నికల్లో ముమ్మాటికీ విజయం నాదే అన్నారు బీఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్. బుధవారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

–సాక్షి ప్రతినిధి, కరీంనగర్/కరీంనగర్

ఎన్నికల ప్రచారం ఎలా ఉంది?

మండుతున్న ఎండల్లో రాజకీయం వేడెక్కింది.. ప్రచారానికి స్పందన బాగుంది. ప్రజలు నీరాజనం పడుతున్నారు. అభివృద్ధి కావాలనే నిర్ణయానికి వచ్చారు. తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను వారు నమ్మడం లేదు. బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ ఐదేళ్లుగా చేసిందేమీ లేదన్న విషయాన్ని గ్రహించారు. విజయం నాదే.

ఈ ఎన్నికల్లో మీ ప్రధాన అస్త్రాలు ఏమిటి?

అభివృద్ధే మా ఎజెండా. 60 ఏళ్ల తెలంగాణలో, పదేళ్ల తెలంగాణలో జరిగిన అభివృద్ధే ఇందుకు నిదర్శనం. పదేళ్లు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రానికి చేసిందేమీ లేదు. రాష్ట్ర విభజన హామీలను సైతం అటకెక్కించింది. కాంగ్రెస్ పార్టీ అడ్డగోలు అబద్ధపు హామీలతో గద్దెనెక్కింది. కాంగ్రెస్, బీజేపీల వైఫల్యాలను ప్రజలకు వివరిస్తున్నాం.

గోదావరి, కావేరి అనుసంధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోయారా?

తెలంగాణకు వరప్రదాయిని గోదావరి నది. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల నీరంతా సముద్రం పాలయ్యేది. గోదావరిలో మన వాటా తేల్చకుండా నదుల అనుసంధానం పేరిట జరుగుతున్న నీళ్ల దోపిడీని బీఆర్‌ఎస్ మొదటి నుంచి అడ్డుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి, తెలంగాణను సస్యశ్యామలం చేశాం. తాజాగా కేంద్రం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వచ్చాక గోదావరి, కావేరి అనుసంధానంపై రాష్ట్రాలకు లేఖలు రాస్తూ ఎంవోయూ చేసుకోవాలని సూచించడం తెలంగాణను దగా చేయడమే. ఎన్నికల దష్ట్యా నీళ్ల దోపిడీ విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లలేకపోయాం.

ఆరు గ్యారంటీలను దాదాపు అమలు చేశామని కాంగ్రెస్ అంటోంది కదా?

ఆరు గ్యారంటీల అమలు శుద్ధ అబద్ధం. కాంగ్రెస్ నైజాన్ని ప్రజలు గుర్తించారు. ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలతోపాటు వివిధ కేటగిరీలకు చెందిన 420 హామీలిచ్చింది. వంద రోజుల్లోనే అమలు చేస్తామని చెప్పారు. కానీ, ఐదు నెలలవుతున్నా అతీగతి లేదు.

ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం ఎందుకు అనివార్యం?

కాంగ్రెస్, బీజేపీలు అభివృద్ధి నిరోధక పార్టీలు. వాటికి ప్రజా సంక్షేమం, అభివృద్ధి అంటే గిట్టదు. 60 ఏళ్లుగా జరిగిన అన్యాయాన్ని ప్రతిఘటించేందుకే రాష్ట్ర సాధన కోసం సబ్బండ వర్గాలు ఒక్కటై, తెలంగాణ తెచ్చుకున్నాం. కొత్త రాష్ట్రాన్ని పదేళ్లలోనే ఔరా అనిపించేలా అభివృద్ధి చేసుకున్నాం. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన అలవికాని హామీలను ప్రజలు నమ్మి, ఆ పార్టీకి పట్టం కట్టారు. బీజేపీతో తెలంగాణలో నయాపైసా పని జరగలేదు. పార్లమెంట్‌లో విభజన హామీలు, తెలంగాణ హక్కులకై నినదించేందుకు బీఆర్‌ఎస్ విజయం అనివార్యం.

కరీంనగర్ అభివృద్ధిలో మీ పాత్ర లేదంటున్న ప్రత్యర్థులకు మీ సమాధానం?

కళ్లుండి చూడలేని, చెవులుండి వినలేని వారు మాట్లాడే మాటలవి. అర్హత లేకున్నా కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ హోదా కల్పించి, రూ.1000 కోట్ల నిధులు తెచ్చా. కూడళ్లు, రహదారులు, క్రీడా కాంప్లెక్స్, వాటర్ డ్రైన్స్, సిగ్నలింగ్ వ్యవస్థ, పార్కుల అభివృద్ధి, ఈ–లైబ్రరీ, అంబేడ్కర్ స్టడీ సర్కిల్, సిరిసిల్ల, కరీంనగర్‌లో మెడికల్ కళాశాలల మంజూరుకు కృషి చేశాను. ఐటీ టవర్, మానేరు రివర్ ఫ్రంట్, తీగల వంతెన, ఆర్‌వోబీలు, టీటీడీ టెంపుల్, ఇస్కాన్ టెంపుల్ నావల్లే మంజూరయ్యాయి. హైకోర్టు విభజనలో లోపాలపై వాదించాను. ఎంపీగా ఉన్న సమయంలోనే జాతీయ రహదారుల కనెక్టివిటీ సెంటర్‌గా కరీంనగర్‌ను తీర్చిదిద్దాను. మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వేలైన్ నిర్మాణానికి కృషి చేశా. హైదరాబాద్ నుంచి సిద్దిపేట వరకు పనులు పూర్తయ్యాయి. సిద్దిపేట, సిరిసిల్ల, కొత్తపల్లి మీదుగా కరీంనగర్ వరకు పనులు పురోగతిలో ఉన్నాయి. 2025లో రైలు అందుబాటులోకి రానుంది.

పార్లమెంట్‌లో ఎన్నిసార్లు మాట్లాడారు? ఎన్ని ప్రశ్నలు అడిగారు?

16వ లోక్‌సభలో 106 సార్లు మాట్లాడాను. 553 ప్రశ్నలు అడిగాను. బహుశా నేను అడిగినన్ని ప్రశ్నలు ఎవరూ అడగలేదు. లోక్‌సభ సమావేశాల తీరుతెన్నులను గూగుల్ మ్యాప్‌లో చూస్తే అర్థమవుతుంది. తెలంగాణ విభజన హామీలు మొదలుకొని ప్రతీ సమస్యను పార్లమెంట్‌లో ప్రస్తావించా. కరీంనగర్ నియోజకవర్గానికి సంబంధించి 213 సమస్యలపై మాట్లాడాను.

బండి సంజయ్ చాలా పనులు చేశానంటున్నారు కదా?

బండి సంజయ్ ఐదేళ్లలో నయాపైసా అభివృద్ధి చేయలే. ఎంపీ కోటా నిధులు ఖర్చు చేయలేదు. ప్రత్యేకమైన ప్రాజెక్టులు, పరిశ్రమలు తెచ్చింది లేదు. గుడి తేలే.. బడి తేలే.. దేవాలయాలకు నిధులు తేలే. చివరికి ప్రసాద్ స్కీంలో వేములవాడ, కొండగట్టు, ధర్మపురి దేవాలయాలను కూడా చేర్చలే. కీలకమైన ప్రాజెక్టులన్నీ నేను ఉన్నప్పుడే మంజూరయ్యాయి. ఆ పనులు పురోగతిలో ఉన్నాయి. అవి నేనే చేశానని సంజయ్ చెప్పుకోవడం విడ్డూరంగా ఉంది. వైకుంఠధామాలు, ఉపాధిహామీ పనులు, నర్సరీలు, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 20 ఏళ్ల నుంచి అమలయ్యే పథకాలను ఆయనే చేసినట్లు బుక్‌లెట్లు ముద్రించుకొని, పంచడం చూస్తుంటే నవ్వాలో ఏడవాలో అర్థం కావడం లేదు.

అబద్ధానికి అంగీలాగేస్తే మోదీ, బండి

- రాజన్న సాక్షిగా ఒక్కటైనా నిజం చెప్పాడా?
- ముస్లిం రిజర్వేషన్‌లపై ఏపీలో మాట్లాడే ధైర్యముందా?
- రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



బర్త్ డే కేక్ కట్ చేస్తున్న మంత్రి పొన్నం, చిత్రంలో కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల

కరీంనగర్ కార్పొరేషన్: అబద్ధానికి అంగీలాగేస్తే బండి సంజయ్, కుర్తా పైజామా తొడిగితే నరేంద్ర మోదీ అని మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. వేములవాడ రాజన్న సాక్షిగా ప్రధాని నరేంద్రమోదీ అబద్ధాలు చెప్పివెళ్లిపోయాడని మండిపడ్డారు. పదేళ్లలో రాజరాజేశ్వర స్వామి గుడికి రూ.కోటి కాదు కదా ఒక్క కోడెను కూడా ఇవ్వలేదన్నారు. కుటుంబపార్టీ అంటున్న మోదీ, యాడ్యురప్ప నుంచి రాజ్‌నాథ్‌సింగ్ వరకు ఎంతోమంది బీజేపీలో ఉన్నారని నాగర్‌కర్నూలు అభ్యర్థి కుటుంబ వారసుడా కాదా అన్నారు. పీవీని కాంగ్రెస్ అవమానించిందంటున్న మోదీ, పీవీని ప్రధాని చేసిందే కాంగ్రెస్ అనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. అవినీతికి బీజేపీ మారుపేరని, ఈడీ, సీబీఐ విచారణలో ఉన్న నిందితులు బీజేపీలో చేరితే ఎలా పునీతులవుతారో చెప్పాలన్నారు. రామగుండం ఎరువుల కర్మాగార పునరుద్ధరణ కాంగ్రెస్ పుణ్యమేనన్నారు. ఎంపీ బండి సంజయ్ కరీంనగర్‌కు ఒక్క పనిచేయలేదని, పైగా చేనేతకు పన్నులు వేయించాడన్నారు.

రాజేందర్‌రావుకు భారీ మెజార్టీ తేవాలి

చిగురుమామిడి: ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు చిగురుమామిడి మండలం నుంచి 20వేల పైచిలుకు మెజార్టీ తేవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం చిగురుమామిడిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారంటీల్లో మూడు అమలు చేశామని, మిగిలినవి త్వరలో అమలు చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, జెడ్పీ ఫ్లోర్‌లీడర్ గీకురు రవీందర్, డీసీసీ ప్రధానకార్యదర్శి చిట్టుమల్ల రవీందర్, జిల్లా అధికార ప్రతినిధులు ఐరెడ్డి సత్యనారాయణరెడ్డి, దాసరి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనారోగ్యంతో రిటైర్డ్ ఎంఈవో మృతి


రాజస్వామి (ఫైల్)

కరీంనగర్: మానకొండూర్, చొప్పదండి మండలాల ఎఫ్ఏసీ రిటైర్డ్ ఎంఈవో, జీహెచ్ఎం చీర్ల రాజస్వామి అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం వేకువజామున కరీంనగర్‌లో మృతి చెందారు. ఈ క్రమంలో డీటీఎఫ్ జిల్లా శాఖ ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేసింది. రాజస్వామి ఉమ్మడి జిల్లాలోని కాటారం మండలం దామెరకుంట గ్రామానికి చెందిన వారు. ప్రస్తుతం కరీంనగర్‌లో నివాసం ఉంటున్నారు. డీటీఎఫ్ కాటారం మండల ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా, ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కౌన్సిలర్‌గా పని చేశారు. మహదేవ్‌పూర్, కాటారం ప్రాంతాల్లో డీటీఎఫ్ బలోపేతానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. జీహెచ్ఎం, డీసీఈబీ సెక్రటరీగా, మానకొండూరు, చొప్పదండి మండలాల ఎఫ్ఏసీ ఎంఈవోగా ఇటు ఉపాధ్యాయులకు, అటు అధికారులకు అందుబాటులో ఉంటూ విశేష సేవలందించారు. రాజస్వామికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

చిరుత దాడిలో దూడ మృతి


మృతి చెందిన దూడ

కోనరావుపేట(వేములవాడ): మండలంలో మళ్లీ చిరుత సంచారం మొదలైంది. తాజాగా ధర్మారంలో ఓ దూడను చంపింది. కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన మల్లెవేణి శ్రీనివాస్ మంగళవారం రాత్రి శ్రీవేంకటేశ్వర గుడి సమీపంలోని పొలం వద్ద దూడను కట్టేశాడు. బుధవారం ఉదయం వెళ్లి చూసేసరికి దూడ మృతి చెంది ఉంది. ఆనవాళ్లను బట్టి చిరుత దాడి చేసినట్లు నిర్ధారణ చేశారు. ఈ సంఘటనతో చుట్టు పక్కల పొలాల రైతులు ఆందోళన చెందుతున్నారు. పశువులను పొలాల వద్ద కట్టేయవద్దని అటవీశాఖ అధికారులు కోరుతున్నారు.

విషగుళికలు తిని 12 గొర్రెలు..


గొర్రెల కళేబరాలు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): విషగుళికలు తిని బుధవారం 12 గొర్రెలు మృతి చెందినట్లు మండల కేంద్రానికి చెందిన బాధిత కాపరులు తెలిపారు. మేత కోసం అడవికి తీసుకెళ్లిన గొర్రెలు.. ఓ కవర్‌లో కనిపించిన మేతను తిన్నాయని, ఇందులో 12 గొర్రెలు తీవ్ర అస్వస్థతతో మృతి చెందాయని, మరికొన్ని అస్వస్థతకు గురయ్యాయని పేర్కొన్నారు. ఒజ్జె రాజయ్యకు చెందిన 6, అల్లంల కొమురయ్యకు చెందిన 3, మేర్గవేన సుధాకర్‌కు చెందిన 2, మండల చంద్రయ్యకు చెందిన ఒక గొర్రె మృతి చెందాయని వివరించారు. అస్వస్థతకు గురైన వాటికి పశువైద్యాధికారులు చికిత్స అందించి కాపాడారు.

సిరిసిల్ల విప్లవ గీతిక

- భూపతిరెడ్డి ఎన్‌కౌంటర్‌కు 30 ఏళ్లు
- రైతాంగ ఉద్యమాల నిర్మాణంలో దిట్ట
- ఎన్వీ కృష్ణయ్య గెలుపులో ప్రధాన పాత్ర
- హైదరాబాద్‌లో బందీ.. బద్దెనపల్లిలో బలి
- భూపతిరెడ్డి యాదిలో అనేక పాటలు


సాయుధ జనశక్తి నక్సలైట్ల దళం (ఫైల్)

సిరిసిల్ల: రైతుకూలి సంఘంగా.. దున్నేవాడికే భూమి దక్కాలి అనే నినాదంతో మొదలైన వామపక్ష ఉద్యమాలకు సిరిసిల్ల కేంద్ర బిందువు. వెట్టిచాకిరీ విముక్తి, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలకు సీపీఐ(ఎంఎల్) జనశక్తి పార్టీ బాటలు వేసింది. ఈక్రమంలో జనశక్తి పార్టీ కరీంనగర్ జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా రైతాంగ పోరాటాలను అగ్ర పథాన నిలిపిన భూపతిరెడ్డి అలియాస్ బోడ లక్ష్మారెడ్డి ఎన్‌కౌంటర్ జరిగి 30 ఏళ్లు అవుతుంది. రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్(పదిర)కు చెందిన భూపతిరెడ్డి ప్రజా ఉద్యమాలకు ఊపిరిలూదారు. జనశక్తి పార్టీ సాయుధ పోరాట పంథాను, పార్లమెంటరీ విధానాన్ని అనుసరిస్తూ.. ప్రజాపోరాటాలను నిర్మించింది. జిల్లా కార్యదర్శి హోదాలో భూపతిరెడ్డి అలియాస్ జీవన్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు లాడ్జీలో 1994 మే 8న పోలీసులకు చిక్కి తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి మామిడితోటలో మే 9న తెల్లవారుజామున ఎన్‌కౌంటర్‌లో బలి అయ్యాడు. ఈ ఎన్‌కౌంటర్ అప్పట్లో ఓ సంచలనం. భూపతన్న ఎన్‌కౌంటర్‌కు 30 ఏళ్లు నిండిన సందర్భంగా ఆయన యాదిలో 'సాక్షి' ప్రత్యేక కథనం...

ఆర్ఎంపీ వైద్యుడు... సాయుధుడయ్యాడు

ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌లో మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన భూపతిరెడ్డి పదో తరగతి వరకు చదువుకున్నాడు. స్థానికంగా ఆర్ఎంపీ వైద్యుడిగా పనిచేస్తూ సీపీఐ(ఎంఎల్) చంద్ర పుల్లారెడ్డి వర్గంలో మిలిటెంట్‌గా పనిచేసేవాడు. దళసభ్యుడిగా, దళనాయకుడిగా, సిరిసిల్ల ప్రాంత జోనల్ కార్యదర్శిగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి వరకు ఎదిగారు. జనశక్తి ఉద్యమ నిర్మాతలు కూర రాజన్న, చలపతిరావు అడుగుజాడల్లో ముందుకు సాగారు. నక్సలైట్ దళాల నిర్మాణం, ప్రజాపోరాటాల నిర్మాణంలో ముందున్నారు. భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు, వెట్టిచాకిరీ విముక్తి, తునికాకు కూలి పెంపు, అటవీ భూముల పంపకం, భూస్వాముల భూములను ప్రజల పరం చేయడం, రైతు, కూలీల కూలి రేట్లను పెంచడం వంటి సామాజిక ఉద్యమాలను సాగించారు. ముఖ్యంగా కులసంఘాలను పెట్టి ప్రజాపోరాటాలను నిర్మించారు. అప్పట్లో సమాంతర ప్రభుత్వాన్ని కొనసాగించారు.

ఎన్వీ కృష్ణయ్యను ఎమ్మెల్యేగా గెలిపించిన వైనం

జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్న భూపతిరెడ్డి 1989లో నెల్లూరు జిల్లాకు చెందిన ఎన్వీ కృష్ణయ్యను సిరిసిల్ల ఎమ్మెల్యేగా గెలిపించారు. భూపతిరెడ్డి సారథ్యంలో సాయుధ దళాలు ప్రజలను, కులసంఘాలను కూడగట్టారు. అప్పట్లో సిరిసిల్ల నియోజకవర్గం పరిధి సిరిసిల్ల, వేములవాడ పట్టణాలతో పాటు చందుర్తి, కోనరావుపేట, బోయినపల్లి మండలాలు ఉండేవి. పట్టున్న గ్రామాల్లో ప్రజలను ఏకం చేసి, కులసంఘాలను ప్రభావితం చేసి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్వీ కృష్ణయ్య విజయం సాధించగా.. కమ్యూనిస్ట్ ఉద్యమ యోధుడు, అప్పటి మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రాజేశ్వర్‌రావు ఆ ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోవడం గమనార్హం. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని నేరెళ్ల, జగిత్యాల, మెట్‌పల్లి, చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గాల్లో జనశక్తి పార్టీ అభ్యర్థులను బరిలో దించి ఓట్లు సాధించడంలో భూపతిరెడ్డి కీలకపాత్ర పోషించారు.


భూపతిరెడ్డి అలియాస్ బోడ లక్ష్మారెడ్డి (ఫైల్)

ఎదురుదాడులను అధిగమించి..

1990 దశకంలో జనశక్తి భూపతిరెడ్డి(బీపీఆర్) పాలకవర్గాల గుండెల్లో రైళ్లు పరుగెత్తించాడు. పోలీసులు టార్గెట్ చేసి ఆయన కోసం అనేక చోట్ల మాటువేశారు. ఎన్నో పోలీసుదాడుల్లో భూపతిరెడ్డి ప్రజల సహకారంతో తప్పించుకున్నారు. మరోవైపు అప్పటి పీపుల్స్‌వార్(ఇప్పటి మావోయిస్టు) సాయుధ దళాలతో వైరుధ్యం ఉండేది. పరస్పర దాడులు.. హత్యలతో సిరిసిల్ల ప్రాంతం అట్టుడికిపోయేది. 1985లో కోనరావుపేట మండలం కొండాపూర్ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు సాయుధులు మృతిచెందారు. అదే మండలంలోని ధర్మారం వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో రిక్కల సహదేవ్‌రెడ్డి ఎన్‌కౌంటర్ అయ్యారు. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో జనశక్తి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారు. సాయుధ దళాల నిర్మాణంలో ముదాం రామన్న, జంపన్న, మంగన్న, యాదన్న, గోపన్న, భీమన్న వంటి ముఖ్యనాయకులను ఉద్యమంలో భాగస్వాములను చేయడంలో భూపతిరెడ్డి ముందున్నారు. 1992లో ఏడు విప్లవ పార్టీలను ఏకం చేసి సీపీఐ(ఎంఎల్) సీపీ గ్రూప్‌గా ఉన్న సాయుధ పార్టీని జనశక్తిగా ఆవిర్భావం చేయడంలో భూపతిరెడ్డి భాగస్వామి అయ్యాడు. సిరిసిల్ల, వేములవాడ, రుద్రంగి వంటి ప్రాంతాల్లోనూ ప్రజలను ఏకం చేశాడు. పట్టణాల్లో ఉంటూ.. అడవుల్లో సాయుధుడిగా సంచరిస్తూ.. ఎన్నో సార్లు పోలీసుల కళ్లు కప్పి తప్పించుకున్నాడు. ఎదురుదాడులను ఎదిరించినా.. అప్పటి సిరిసిల్ల సీఐ రామయ్య పన్నిన వ్యూహంలో బందీ అయి... బలి అయ్యాడు.


హరిదాస్‌నగర్‌లో నిర్మించిన భూపతిరెడ్డి స్మారక స్థూపం

ఆయన యాదిలో పాటలు..

30 ఏళ్ల కిందట ఎన్‌కౌంటర్ అయిన భూపతిరెడ్డి యాదిలో అనేక పాటలు అరుణోదయ కళాకారులు కైగట్టి పాడారు. అందులో 'సుడిసుడి గుండాలు.. ఆగని గండాలు.. సూర్యుడయ్యి నిలిచే జీవన్.. చుక్కలల్ల గలిచే జీవన్'.. అంటూ.. వచ్చిన పాట జనబాహుళ్యంలో ప్రాచుర్యం పొందింది. హరిదాస్‌నగర్‌లో కామారెడ్డి–కరీంనగర్ ప్రధాన రహదారి పక్కనే ఆయన స్మారకార్థం స్థూపాన్ని ప్రజలు నిర్మించారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో జనశక్తి ఉద్యమ నిర్మాతల్లో ముఖ్యుడిగా భూపతిరెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది.

'బోయినపల్లి'కి ప్రైవేట్ టీచర్ల మద్దతు


మాట్లాడుతున్న ట్రస్మా నాయకుడు శేఖర్‌రావు

కరీంనగర్: జిల్లాలోని ప్రైవేట్ టీచర్ల మద్దతు బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కేనని ట్రస్మా రాష్ట్ర ముఖ్య సలహాదారు యాదగిరి శేఖర్‌రావు, ప్రైవేట్ ఉపాధ్యాయుల సంఘం జిల్లా బాధ్యులు హనుమాండ్ల రవీందర్‌రెడ్డి, ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. బుధవారం కరీంనగర్‌లోని ఓ హోటల్లో సమావేశం నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. విద్యావేత్త, అన్ని సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉన్న వినోద్‌కుమార్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కరోనా కాలంలో ఆయన విన్నపం మేరకే ప్రభుత్వం 6 నెలలపాటు ప్రైవేట్ టీచర్లకు రూ.2,500, 25 కిలోల బియ్యం చొప్పున అందజేసిందన్నారు. ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలపై ఎంపీగా పార్లమెంట్‌లో మాట్లాడారని, రూ.10 లక్షల ఇన్సూరెన్స్, నివేశన స్థలాల విషయమై గళమెత్తారన్నారు. వినోద్‌కుమార్‌ను ఎంపీగా గెలిపిస్తే ప్రైవేట్ టీచర్లతోపాటు అసంఘటిత రంగ కార్మికులకు న్యాయం జరుగుతుందని తెలిపారు.

తిమ్మాపూర్‌లో అగ్ని ప్రమాదం

- ఐదు రోజుల్లో మూడోసారి..
- ఆందోళనలో రైతులు


తిమ్మాపూర్‌లో మంటల్లో కాలిపోతున్న పశుగ్రాసం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల తిమ్మాపూర్‌లో బుధవారం వ్యవసాయ పొలాల్లో అకస్మాత్తుగా మంటలు ఎగిసిపడి పశుగ్రాసం, గుడిసెలతోపాటు అందులో నిల్వ చేసిన టేకు కలప, విద్యుత్ మోటార్ల పైపులు, స్టార్టర్లు కాలిపోయాయి. ఐదు రోజుల వ్యవధిలో మూడు సార్లు ఒకే గ్రామంలో మంటలు వ్యాపించి ఆస్తి నష్టం జరుగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తిమ్మాపూర్‌కు చెందిన రైతులు అల్లె ముత్తయ్య, ప్రదీప్, కొలకాని లక్ష్మయ్య, కొలకాని రవి, ఉస్కె శ్రీనివాస్‌కు చెందిన గడ్డివాములు, గుడిసెలు, వంట సామగ్రి, టేకు కలప, కరెంట్ పైపులు కాలిపోయాయి. దీంతో రైతులకు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లింది. బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఎంసీ మాజీ చైర్మన్ అందే సుభాష్, నాయకులు వరద సతీశ్, గట్ల అనిల్, అల్లె శంకర్, భీమరి శేఖర్ కోరారు.

పోస్టల్ బ్యాలెట్ గడువు పొడిగింపు


పోస్టల్ ఓటు వేసిన డీసీపీ చేతన

పెద్దపల్లిరూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించే గడువును ఈనెల 10వ తేదీ వరకు పొడిగించామని పెద్దపల్లి అసెంబ్లీ ఎన్నికల సహాయ అధికారి గంగయ్య తెలిపారు. బుధవారమే గడువు ముగియాల్సి ఉందని, అయితే, పోస్టల్ బ్యాలెట్ పొందిన వారంతా ఓటుహక్కు వినియోగించుకునేందుకు వీలుగా గడువు పొడిగించామని పేర్కొన్నారు. కాగా, స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటీ సెంటర్‌లో పెద్దపల్లి డీసీపీ చేతన తన ఓటుహక్కు వినియోగించుకున్నారు. అదేవిధంగా ఎంపీ అభ్యర్థి ప్రొఫెసర్ నెతానియల్ ఓటుహక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నారు.

ఓటు గల్లంతు అయితే..

జ్యోతినగర్(రామగుండం): పోలింగ్ కేంద్రంలోని ఓటరు జాబితాలో ఓటు లేకపోయినా, ఈ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రంలోకి వెళ్లేసరికి అక్కడ మీ ఓటు లేకపోయినా, ఓటరు జాబితాలో పేరు గల్లంతైనా, ఓటరుకార్డు లేదా ఆధార్ కార్డు చూపించి సెక్షన్ 49ఏ కింద చాలెంజ్ ఓటు వేయవచ్చు. మీ ఓటు అప్పటికే వేరే ఎవరైనా వేసేసినట్లయితే, ధైర్యంగా టెండర్ ఓటు అడగవచ్చు. ఏ పోలింగ్ కేంద్రంలో అయినా.. 14శాతం దాటి ×టెండర్ ఓట్లు పోలైతే, అక్కడ రీ–పోలింగ్ నిర్వహిస్తారు.

ఓటరు స్లిప్పుల కోసం..

- 1950 నంబరుకు ఎస్ఎంఎస్ చేయండి.
- ECI–VOTER ID.
- 15 సెకన్లలో ఓటరు స్లిప్పు వస్తుంది.

పోలీసుల అదుపులో బైక్ దొంగ

- విచారిస్తున్న సిద్దిపేట పోలీసులు
- మరో ముగ్గురి కోసం గాలింపు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఓ బైక్ దొంగను బుధవారం సిద్దిపేట జిల్లా క్రైం బ్రాంచ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల సిద్దిపేటలో నాలుగు ద్విచక్ర వాహనాలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటనకు సంబంధించి అక్కడి పోలీసులు విచారణ చేపట్టగా మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు ఆ వాహనాలను దొంగిలించినట్లు తెలియడంతో అదుపులోకి తీసుకున్నారు. దొంగను విచారించగా.. మరో ముగ్గురికి సంబంధం ఉన్నట్లు తెలిసింది. దీంతో ఆ ముగ్గురి కోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలిసింది. కాగా ఇటీవల అంతర్ జిల్లాల్లో ద్విచక్ర వాహనాలు పెద్ద సంఖ్యలో చోరీకి గురవుతున్న విషయం తెలిసిందే. బైక్ చోరీలను పోలీసులు సీరియస్‌గా తీసుకొని దొంగలను పట్టుకునే పనిలో పడ్డారు.

రూ.9.25 లక్షలు పట్టివేత

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని మోచీబజార్‌లో పట్టణ ఎస్సై మన్మథరావు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. బీర్‌పూర్ మండలం మంగేళకు చెందిన గుర్రం రాజేశం ఎలాంటి ఆధారాలూ లేకుండా తీసుకెళ్తున్న రూ.2.50 లక్షలు సీజ్ చేశారు. కొత్తబస్టాండ్‌లో జగిత్యాలకు చెందిన షేక్ సాదుల్లా నుంచి రూ.2లక్షలు, సారంగాపూర్ మండలం లచ్చక్కపేటకు చెందిన కొలగాని సురేశ్ నుంచి జంబిగద్దె ప్రాంతంలో రూ.1.80 లక్షలు, పాతబస్టాండ్ ప్రాంతంలో జగిత్యాల రూరల్ మండలం గొల్లపల్లెకు చెందిన పుల్లె శివ నుంచి రూ.2.95 లక్షలను సీజ్ చేసి కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌సెల్‌కు తరలించామని పోలీసులు పేర్కొన్నారు.


రూ.2.09 లక్షలు, చీరలు..


నగదు చూపుతున్న పోలీసులు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం వాహన తనిఖీలు చేపట్టామని ఇన్‌స్పెక్టర్ సరిలాల్ తెలిపారు. రాజీవ్ చౌక్‌లో కరీంనగర్ తిలక్ రోడ్‌కు చెందిన పెద్ది రాధాకృష్ణ వద్ద రూ.2.09 లక్షలు పట్టుకున్నామన్నారు. సంబంధిత ఆధారాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అక్రమ డబ్బు, మద్యం సరఫరాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కోర్టు చౌరస్తాలో ఓ వాహనంలో తరలిస్తున్న 400 చీరలను పట్టుకున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

'ప్రైవేట్' దోపిడీ షురూ

- కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో ప్రభుత్వ ఉత్తర్వులు బేఖాతరు
- ముందస్తు ప్రవేశాల ప్రచారానికి రెడీ
- చోద్యం చూస్తున్న విద్యాశాఖ



ముందస్తు అడ్మిషన్ల కోసం ఓ కార్పొరేట్ స్కూల్ కరపత్రం

కరీంనగర్: ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు ప్రభుత్వ ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఫీజుల పేరిట విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలకువేలు దండుకుంటున్నాయి. ఏటా జిల్లా విద్యాశాఖ నోటీసులు జారీ చేయడం, తనిఖీలు చేపట్టడం, మళ్లీ యథావిధిగా ప్రైవేట్ యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం రివాజుగా మారింది. పలుస్కూళ్లను తనిఖీ చేస్తూ లోపాలు ఎత్తిచూపుతున్నామని చెప్పడం వరకే విద్యాశాఖ అధికారులు పరిమితమవుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఆర్భాటంగా ప్రచారం చేస్తూ ప్రవేశాలు తీసుకోవడం, పాఠశాలల్లోనే పుస్తకాలు, దుస్తులు అమ్మడం, నిబంధనలు ఉల్లంఘించి వేలల్లో ఫీజులు వసూలు చేయడం లాంటి పనులు యథేచ్ఛగా కొనసాగుతూనే ఉన్నాయి.

నిబంధనలు తూచ్

- జీవో ప్రకారం ప్రైవేట్ స్కూళ్లలో కమిటీలను ఏర్పాటు చేసి ఆ వివరాలు విధిగా నోటీసు బోర్డులపై ప్రదర్శించాలన్న నిబంధనలు ఏ పాఠశాలలో అమలవుతున్న దాఖలాలు లేవు.
- 1994లో జారీ చేసిన జీవో ప్రకారం ప్రైవేట్ స్కూళ్లలో ఫీజు నిర్ణయించేందుకు పాఠశాల చైర్మన్, ప్రిన్సిపాల్, తల్లిదండ్రుల్లో ఇద్దరితో కమిటీని నియమించాలి. పాఠశాల వసూలు చేసే ఫీజుల్లో 5 శాతం యాజమాన్యం ఆదాయం కింద, 15 శాతం పాఠశాల నిర్వహణ, 15 శాతం అభివృద్ధికి, 15 శాతం ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రయోజనాలకు, 50 శాతం వేతనాలకు వినియోగించాలని ఉంది. ఏటా పాఠశాలలో వసూలైన ఫీజు మొత్తం, ఖర్చుల ఆడిట్ రిపోర్టులను జిల్లా విద్యాశాఖాధికారికి యాజమాన్యాలు సమర్పించాలి. కానీ, ఇవేమి జిల్లాలో అమలు కావడం లేదు.
- 2008లో జారీ చేసిన జీవో నం.90,91,92 ద్వారా ఫీజు నిర్ణయించేందుకు డీఈవో, జిల్లా ఆడిట్ అధికారి, స్వచ్ఛంద సంస్థ లేదా పేరెంట్స్ కమిటీ ప్రతినిధితో కూడిన ఫీజుల రెగ్యులటరీ కమిటీని జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నియమించాలి. సదరు కమిటీ స్కూల్‌లో వసతులను పరిశీలించి ఫీజు ఎంత వసూలు చేయాలో నిర్ణయిస్తుంది. అలాగే నిర్ధారించిన ఫీజు వివరాలు పాఠశాలల నోటీసు బోర్డులపై ప్రదర్శించాలని నిబంధన ఉంది. కానీ, దీని అమలుపై అధికారుల పర్యవేక్షణ లేదు.

రూ.వేలల్లో వసూలు..

ఫీజుల విషయంలో ఒక్కో స్కూల్‌లో ఒక్కో విధంగా రూ.వేలల్లో దండుకుంటున్నారు. పర్యవేక్షణ కొరవడి ప్రభుత్వ నిబంధనలు అమలు కావడం లేదన్న విషయం తనిఖీల్లో బయటపడింది. కరీంనగర్‌లోని పలు ప్రైవేటు స్కూళ్లలో 1వ తరగతికి రూ.18,000 నుంచి రూ.55,000, పదో తరగతికి రూ.30,000 నుంచి రూ.95,000 వసూలు చేస్తున్నారని గతేడాది అధికారుల తనిఖీల్లో తేలింది. అయితే ఫీజుల వ్యవహారంపై అధికారులు కఠిన నిర్ణయాలు తీసుకోకపోవడంతో ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల వ్యాపారానికి అడ్డుకట్ట లేకపోగా వారు 'ఆడిందే ఆట.. పాడిందే పాట' అన్న చందంగా తయారైంది.

ముందస్తు ప్రవేశాలు

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ప్రైవేట్ స్కూళ్లు విద్యార్థుల ప్రవేశాలను ప్రారంభించగా, ఇందులో నగరంలోని చాలా పాఠశాలలు ముందంజలో ఉన్నాయి. కాగా, గత విద్యాసంవత్సరం ప్రారంభంలో అధికారుల తనిఖీల్లో మాత్రం మెజార్టీ పాఠశాలల్లో ప్రవేశాలు జరగలేదని తేల్చారు. తనిఖీ చేసిన 25 స్కూళ్లలో పదింటిలో మాత్రమే ప్రవేశాలు జరుగుతున్నాయని నివేదికలో పేర్కొనడం గమనార్హం. కానీ, క్షేత్రస్థాయిలో మెజార్టీ స్కూళ్లలో ప్రవేశాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

నిర్లక్ష్యం వీడాలి



విద్యాశాఖ అధికారులు నామమాత్రపు తనిఖీలతో ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీకి, ముందస్తు ప్రచారాలకు అడ్డూఅదుపు లేకుండాపోయింది. దీంతో ప్రైవేట్ యాజమాన్యాలు ఇబ్బడిముబ్బడిగా విద్యార్థుల నుంచి ఫీజులు దండుకుంటున్నాయి. విద్యాశాఖ నిర్లక్ష్యం వీడకుంటే రానున్న రోజుల్లో ఉద్యమాలను ఉధృతం చేస్తాం. విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ప్రైవేట్ స్కూళ్లను తనిఖీ చేసి వసతులు, ఫీజుల నియంత్రణపై విద్యాశాఖ అధికారులు దృష్టిసారించాలి.

– గజ్జెల శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి


ఉదయం కోడెకు పూజలు చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ

ఒకే కోడెకు ప్రధాని, మంత్రి పూజలు


రాత్రి అదే కోడెకు పూజలు చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ రాజన్న కోడెమొక్కు చెల్లించుకునే క్రమంలో బుధవారం ఉదయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాత్రి రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్ పూజలు చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వేములవాడకు వచ్చిన మోదీ కోడెకు పూజలు నిర్వహించగా.. తన బర్త్‌డే పురస్కరించుకొని ఆలయంలో పూజలు నిర్వహించేదుకు వెళ్లిన మంత్రి అదే కోడెకు పూజలు నిర్వహించడం విశేషం.

– వేములవాడ

'డాక్టర్లపై దాడులు తగవు'


నల్లబ్యాడ్జీలు ధరించి, ఆస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న డాక్టర్లు

- కోరుట్ల ప్రభుత్వ వైద్యుడిపై దాడికి ఖండన
- జీజీహెచ్ ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన

కోల్‌సిటీ(రామగుండం): డాక్టర్లపై దాడులు చేయడం తగదని తెలంగాణ టీచింగ్ ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్(టీటీజీడీఏ) ప్రతినిధులు అన్నారు. కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రిలో ఇటీవల ఓ ఆటో డ్రైవర్ చనిపోయిన సంఘటనపై, మృతుడి బంధువులు డాక్టర్‌పై దాడి చేయడం శోచనీయమన్నారు. దాడిని వ్యతిరేకిస్తూ గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) ఎదుట టీటీజీడీఏ రామగుండం కమిటీ ఆధ్వర్యంలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, రెసిడెంట్ డాక్టర్లు బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఫరీద్ మహ్మద్, జనరల్ సెక్రటరీ రవివర్మ మాట్లాడారు. ఆస్పత్రి ఘటనపై ప్రభుత్వం విచారణ జరపకుండానే బాధిత డాక్టర్‌ను సస్పెండ్ చేయడం బాధాకరమన్నారు. ఇలాంటి వాటితో డాక్టర్లలో భయం చోటుచేసుకుని వైద్య సేవలు అందించే వీలుండదన్నారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు బాధిత డాక్టర్‌పై సస్పెన్షన్ తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు వేణుమాధవ్, శ్రీనివాస్, ఆదిష్‌రెడ్డి, శిరీష, లక్ష్మీనర్సయ్య, రాజీవ్, మనుంజయ్, ప్రశంస, అమూల్, స్వామి, విజిత్, హర్షిణి తదితరులు పాల్గొన్నారు.

అవగాహనే ప్రథమ చికిత్స

సేవ

ఈ ఫొటోను చూడండి. ఇందులో ఉన్నది షుగర్ పేషెంట్లు. ఒకరితో ఒకరు షుగర్ వ్యాధి గురించి మాట్లాడుకుంటూ అవగాహన కల్పించుకుంటున్నారు. 'చికిత్స కంటే అవగాహన ముఖ్యం' అంటారు ప్రియా దేశాయ్. బెంగళూరులో ఆమె పేదవారి కోసం ఉచిత క్లినిక్‌లు నడుపుతున్నారు. డయాబెటిస్, బి.పి ఉన్న వారికి సదస్సులు నిర్వహిస్తూ ఉచిత మందులు అందేలా చూస్తున్నారు. ప్రతి ఉదయం ఈ క్లినిక్‌ల ముందు క్యూ కట్టే పేషెంట్లను చూస్తే ప్రియా సేవ తెలుస్తుంది.





ప్రియా దేశాయ్

బెంగళూరులోని శాంతి నగర్‌లో ఉన్న 'అనాహత్' క్లినిక్‌కు వెళితే ఒక బోర్డు మీద ఐదారు రకాల భోజనం ప్లేట్ల ఫొటోలు ఉంటాయి. వాటిలో రొట్టె, కూర, అన్నం, ఇతర కూరలు ఉంటాయి. ప్రతి ప్లేట్ కింద స్టార్లు ఇచ్చి ఉంటారు. ఐదు స్టార్లు ఇచ్చిన భోజనం ప్లేట్‌ను ఆహారంగా తీసుకోవాలని బీపీ, షుగర్ ఉన్న పేషెంట్లకు సులభంగా అర్థమయ్యేలా చెప్తారు. మీ ప్లేట్‌లో ఏముంది అనేదే మీ ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుందని ఈ క్లినిక్‌లో వారానికి రెండుసార్లు జరిగే అవగాహన సదస్సుల్లో తెలియచేస్తారు. ఇలాంటి అవగాహన దీర్ఘకాలిక వ్యాధులైన షుగర్, బీపీల తీవ్రతను తగ్గిస్తాయని అంటారు ప్రియా దేశాయ్. ఆమె ఈ క్లినిక్ నిర్వాహకురాలు.

10 వేల మందికి ఒక క్లినిక్

బెంగళూరు జనాభా కోటీ ముప్పై లక్షలకి పైనే. కాని ఇక్కడ మొత్తం 147 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మాత్రే ఉన్నాయి. అంటే దాదాపు 80 వేల మందికి ఒక క్లినిక్. ప్రభుత్వ లెక్కల ప్రకారం చూసినా 30 వేల మందికి ఒక క్లినిక్ ఉండాలి. ఆదర్శవంతమైన పాలనా నిర్వహణ అంటే 10 వేల మందికి ఒక క్లినిక్. ఇలాంటి స్థితిలో పేదలకు ఎలా మంచి వైద్యం అందుతుంది అని అడుగుతారు ప్రియా



దేశాయ్. జర్నలిజం అభ్యసించిన ప్రియ తన తల్లి రాణీదేశాయ్ స్ఫూర్తితో వైద్య సేవారంగంలోకి వచ్చారు. అనేక స్వచ్ఛంద సంస్థల్లో పని చేసిన రాణీ దేశాయ్ తన కుమార్తెతో కలిసి 'అనాహత్ క్లినిక్'కు అంకురార్పణ చేశారు. బెంగళూరులో ఉన్న పేదలకు వైద్యం అందించాలనేది అనాహత్ సంకల్పం. నేరుగా క్లినిక్‌కు వచ్చేవారికి వైద్యం అందిస్తూనే హెల్త్ క్యాంప్స్ ద్వారా స్లమ్స్‌లో వైద్య చికిత్స అందించడం అనాహత్ లక్ష్యం. ఇప్పటికి 3 లక్షల మందికి హెల్త్ క్యాంప్స్ ద్వారా వైద్యం అందించారు ప్రియ తన తల్లి రాణీదేశాయ్ చేయూతతో.

బీపీ, షుగర్ బాధితులు

'నగరాల్లో పని చేసే దిగువ ఆదాయ వర్గాల వారు సమయానికి భోజనం చేయరు. ఆహార అలవాట్లు, నిద్రలో క్రమశిక్షణ ఉండదు. శరీరాన్ని పట్టించుకోరు. దానివల్ల బీపీ బారిన పడుతున్నారు. షుగర్ వచ్చిన వారికి షుగర్ వచ్చిన సంగతి కూడా తెలియడం లేదు. మా క్లినిక్‌కు రోజుకు వంద మంది వస్తారు. ఎక్కువ మందికి ఇవే సమస్యలు. మా కౌన్సిలింగ్స్ వల్ల ఎక్కడ ఏ పనిలో ఉన్నా రాత్రి ఎనిమిదికి భోజనం చేయడం నేర్చుకున్నారు చాలామంది' అంటారు ప్రియా దేశాయ్. మిత్రుల దాతల సహాయంతో ఈ క్లినిక్‌ను నడుపుతున్న ప్రియ తగిన సహాయం దొరికితే సేవను విస్తరించవచ్చు అని తపన పడుతుంటారు.

70 రకాల పరీక్షలు

అనాహత్ క్లినిక్‌లో 70 రకాల టెస్ట్‌లు ఉచితంగా చేస్తారు. 100 రకాల మందులు ఉచితంగా ఇస్తారు. వైద్యుల పరీక్ష ఉంటుంది. వీరే కాకుండా ఫిజియోథెరపిస్ట్‌లూ సేవలు అందిస్తారు. 'ఆనంద' అనే కార్యక్రమం ద్వారా సైకియాట్రీ కౌన్సెలింగ్ కూడా ఉంటుంది. 'అన్నింటికంటే ముఖ్యం మేము పేషెంట్స్‌ను ఒక కమ్యూనిటీగా మారుస్తాం. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారిని ఒక గ్రూప్‌గా చేసి వారే ఒకరితో మరొకరు మాట్లాడుకుని తామంతా ఈ వ్యాధులను ఎదిరించవచ్చు అనే ధైర్యం పొందేలా చేస్తాం' అన్నారు ప్రియ. చికిత్స అందించడం ఎంత ముఖ్యమో వ్యాధి పట్ల అవగాహన, నివారణ అంతే ముఖ్యమని భావిస్తారు ఈ క్లినిక్‌లో. అందుకే బెంగళూరు పేదలు అనాహత్ ద్వారా లబ్ధి పొందుతున్నారు. ప్రియను, ఆమె తల్లి రాణి దేశాయ్‌ను అభిమానిస్తున్నారు.

'స్లమ్స్‌లో ఉన్నవారు క్లినిక్స్‌కు రారు. స్లమ్స్‌లో హెల్త్ క్యాంప్స్ విస్తృతంగా... క్రమబద్ధంగా జరగాలి. అప్పుడే దీర్ఘకాలిక వ్యాధులు బయటపడి చికిత్స మొదలవుతుంది. లేకుంటే అనవసర మరణాలు కొనసాగుతూనే ఉంటాయి. అందుకే అందరూ ఈ విషయమై ముందుకు రావాలి' అని కోరుతున్నారు ప్రియ.

నైపుణ్యమే పెట్టుబడి

సెరామిక్ అండ్ గ్లాస్ డిజైనింగ్ కష్టమైనదిగా భావిస్తూ మహిళలు ఈ కళను ఎంచుకోవడానికి వెనుకంజ వేస్తుంటారు. అలాంటి ఈ కళను ఎంతో ఇష్టంగా ఎంచుకొని, అందులో రాణిస్తోంది తిరువనంతపుర వాసి రోసా శ్రుతి అబ్రహం. సాధారణంగా పెద్ద పెద్ద కర్మాగారాల నుంచి భారీగా ఉత్పత్తి అయ్యే సిరామిక్ వస్తువుల గురించి మనకు తెలిసిందే. అత్యంత వేగవంతమైన ప్రపంచంలో ప్రాచీన కళారూపాల వెనక దాగి ఉన్న నైపుణ్యాన్ని ఈ తరానికి పరిచయం చేస్తోంది రోసా శ్రుతి.



రోసా శ్రుతి అబ్రహం

"మురికి పట్టిన ఏప్రాన్, మట్టితో నిండిన చేతులు, చిక్కుబడిపోయినట్టు చిందరవందరగా ఉండే జుట్టు.. రోజులో ఎక్కువ పనిగంటలు ఇలాగే కనిపిస్తాను. అయితే, కొంతకాలంగా వరసగా ఆర్డర్లు పొందుతున్నాను. అందుకే రోజులో ఎక్కువ గంటలు స్టూడియోలోనే ఉండిపోతున్నాను.







అందుకు ఎంతో ఆనందంగా ఉన్నాను. నేను ఓ స్టూడియో ఓనర్ అనేకంటే నా స్టూడియోలో నిరంతరం పనిచేసే ఒక శ్రామికురాలిని అని చెప్పుకోవడానికే ఇష్టపడతాను. స్టూడియో అంటే పెద్దదేమీ కాదు ఒక గది. అయితే, బయట పచ్చదనం ఉంటుంది. నాదైన ఈ ప్రపంచంలో అందమైన సిరామిక్స్, గ్లాస్ డిజైన్స్ రూపొందిస్తుంటాను.

మాస్టర్స్ పూర్తి చేసిన తర్వాత ఏడేళ్లగా ఈ తయారీని చేపడుతూనే ఉన్నాను. నిజానికి ఇది ప్రతిరోజూ ఒక కొత్త పాఠమే. నా స్టూడియోలో గడిపే ప్రతి క్షణం ఎంతో విలువైనది.

యజ్ఞంలా .. కళారూపాలు

సిరామిక్స్ అండ్ గ్లాస్ డిజైనింగ్‌లో మాస్టర్స్ పూర్తి చేశాక కొన్ని కంపెనీలలో వర్క్ చేశాను. ఏడేళ్లపాటు వివిధ కంపెనీలలో చేసిన ఉద్యోగాలు నాకు అంతగా సంతృప్తినివ్వలేదు. దీంతో ఉద్యోగంలో సంపాదించిన కొద్ది మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టి ఇంటి దగ్గరే 'కొసావో' పేరుతో ఓ స్టూడియోను ఏర్పాటు చేశాను. ఇప్పుడు





ఇదే నాకు జీవనాధారం అయ్యింది. కళాకారిణి నుంచి వ్యవస్థాపకురాలిగా ఎదగడం, నేర్చుకోవడం ... నా ప్రయాణం ఇలాగే కొనసాగించాలనుకుంటున్నాను. ఐదేళ్లుగా ఈ పని ఓ యజ్ఞంలా కొనసాగుతూనే ఉంది. కళారూపాల సృష్టిలోనే కాదు ఇతరులకు బోధించడంలోనూ ఆనందాన్ని, ఆదాయాన్నీ పొందుతున్నాను. అందుకే నా స్టూడియోలో ప్రతిరోజూ అన్ని సీజన్లలోనూ క్లాసులు ఉంటూనే ఉంటాయి. 'ఐదేళ్ల కిందటి వరకు మీరెక్కడ ఉంటారో మాకు తెలియదు, ఇప్పుడు ఎవరిని అడిగినా ఇట్టే చెప్పేస్తారు' అని క్లాసులకు వచ్చినవారు అంటుంటే చిరునవ్వే నా సమాధానంగా ఉంటుంది.

దేనికదే ప్రత్యేకం..

బయట మనకు ఎన్నో రకాల మిషన్ మేడ్ కళారూపాలు లభించవచ్చు. కానీ, వాటిలో ఒక ఆత్మ అంటూ ఉండదు. ఈ కళను ఏ డిజిటల్ పరికరాలతోనూ భర్తీ చేయలేం. వీటి తయారీలో ఓర్పు, పట్టుదల అవసరం. అందుకు మంచి ప్రతిఫలం కూడా లభిస్తుంది. ఉద్యోగంలో మరొకరి కోసం పనిచేస్తున్నప్పుడు మనకు పరిమితులు ఉంటాయి. సొంతంగా ఏదైనా ప్రారంభించాలంటే అందులో నైపుణ్యం అవసరం. వివిధచోట్ల పనిచేసిన అనుభవం కూడా నాకు చాలా సహాయపడింది. అలాగే, విభిన్న వ్యక్తుల నుంచి వారి ప్రవర్తనల నుండి రకరకాల పద్ధతులు, మార్గాలను అర్థం చేసుకోగలిగాను. ఇవన్నీ నన్ను నేను కొత్తగా మలుచుకోవడానికి సహాయపడ్డాయి.



వస్తువుల తయారీని ఫొటోలుగా తీసి, వాటిని ఆన్‌లైన్ ద్వారా కస్టమర్లకు షేర్ చేస్తుంటాను. ఆ తర్వాత రకరకాల పద్ధతుల్లో అనుకున్న రూపానికి తీసుకువస్తాను. ముఖ్యంగా పాత సినిమాలు, డైలాగ్‌ల నుండి ప్రేరణ పొందిన థీమ్‌లతోనూ వస్తువుల తయారీకి ప్లాన్ చేస్తుంటాను. ఇవి చాలామందిని ఆకట్టుకుంటున్నాయి. సిరామిక్ అండ్ గ్లాస్ డిజైనింగ్ అకాడమీ ఏర్పాటు చేయాలనే ఆలోచనతో నా ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాను' అని వివరిస్తుంది రోసా శ్రుతి.

విజయపథం

'మోనా'ర్క్

* ఆత్మవిశ్వాసమే రాజసం
* సాధారణ స్థాయి నుంచి బిలియనీర్ వరకు

వరల్డ్స్ మోస్ట్ ప్రిస్టీజియస్, గ్లామరస్ ఫ్యాషన్ ఈవెంట్ 'మెట్ గాలా-2024'లో బ్రేక్‌ఔట్ స్టార్‌గా అందరి దృష్టిని ఆకర్షించింది మోనా పటేల్. 'ఎవరీ మోనా?' అని సెర్చ్ చేసేలా చేసింది. వడోదర నుంచి అమెరికా వరకు ఫ్యాషన్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా మోనా ఎదిగిన వైనం స్ఫూర్తిదాయకం. ఫిలాంత్రపిస్ట్‌గా ఎన్నో రకాల సేవాకార్యక్రమాలు చేపడుతోంది...



మోడల్‌గా మోనా పటేల్

గుజరాత్‌లోని వడోదరలో పుట్టి పెరిగిన మోనా పటేల్ చాలామంది అమ్మాయిలలాగే స్కూల్, కాలేజీ రోజుల్లో రకరకాల వివక్షలు, సవాళ్లు ఎదుర్కొంది. 'ఆటలు మగవారి కోసమే','ఆడవారు ఇంట్లోనే క్షేమంగా ఉంటారు' 'లక్ష్యాలు అనేవి మగవారి కోసమే' ఇలాంటి ఎన్నో పురుషాధిక్య భావజాల ధోరణులకు సంబంధించిన మాటలు విన్నది మోనా.

అయితే అలాంటి మాటలకు ఎప్పుడూ విలువ ఇవ్వలేదు.

సవాలుకు సై అనడం తప్ప వెనక్కి తిరిగి చూసింది లేదు.

పన్నెండు సంవత్సరాల వయసు నుంచి బాయ్స్-స్టైల్ హెయిర్ కట్‌తో కనిపించడం ప్రారంభించింది. వస్త్రధారణ కూడా అచ్చం అబ్బాయిలలాగే ఉండేది.

'ఏమిటీ వేషం'లాంటి వెక్కిరింపులకు ముఖం మీదే సమాధానం చెప్పి నోరు మూయించేది.

'హెయిర్ కట్ అనేది రెబిలియన్ యాక్ట్. సెల్ఫ్-ఎంపవర్‌మెంట్‌కు సింబల్' అంటూ ఆనాటి రోజులను గుర్తు చేసుకుంటుంది మోనా.

ఇంటి నుంచి బయటి వెళ్లడమే సాహసంగా భావించే రోజుల నుంచి చదువు కోసం గుజరాత్ యూనివర్శిటీలో అడుగు పెట్టింది. హోమ్ టౌన్ తప్ప మరో టౌన్ తెలియని మోనా పైచదువుల కోసం న్యూజెర్సీలోని రాత్‌గర్స్ యూనివర్శిటీకి వెళ్లింది.

'ఔట్‌సైడ్ ఇండియా లైఫ్ గురించి ఎప్పటి నుంచో ఆసక్తి ఉండేది. చదువుల రూపంలో అది నెరవేరింది. ఒంటరిగా బయలుదేరినప్పటికీ ఆ ఒంటరితనమే ధైర్యాన్ని ఇచ్చింది. కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసింది' అంటుంది మోనా.

అమెరికాకు వెళ్లిన కొత్తలో అక్కడి వేషధారణ, ఆచార వ్యవహారాలు తనకు కొత్తగా అనిపించేవి.

'ఈ ప్రపంచంలో నేను ఇమడగలనా!' అని కూడా సందేహించేది.

అయితే ఆ ప్రపంచంలోనే ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయధ్వజం ఎగరేసింది మోనా పటేల్.

ఒక్కో మెట్టు ఎక్కుతూ హెల్త్‌కేర్, టెక్, రియల్ ఎస్టేట్... మొదలైన రంగాలలో ఎనిమిది కంపెనీలను నెలకొల్పింది.

వ్యాపార విజయాలే కాదు సామాజిక సేవాకార్యక్రమాలు కూడా మోనాకు ఇష్టం. జెండర్ ఈక్వాలిటీ, అమ్మాయిల చదువు, ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను దృష్టిలో పెట్టుకొని 'కొచర్ ఫర్ కాజ్' అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించింది.

'మూడు పెద్ద సూట్‌కేస్‌లతో తొలిసారిగా ఇండియా నుంచి డల్లాస్‌కు బయలుదేరాను' అని గతాన్ని గుర్తు తెచ్చుకుంటుంది మోనా.

ఆ సూటుకేసులలో విలువైన వస్తువులు ఉండచ్చు. అయితే వాటి అన్నిటికంటే అత్యంత విలువైనది... ఆమెలోని ఆత్మవిశ్వాసం. ఆ ఆత్మవిశ్వాసమే మోనా పటేల్‌ను తిరుగులేని ఎంటర్‌ప్రెన్యూర్‌గా మార్చింది. ఎంతోమందికి స్ఫూర్తి ఇచ్చేలా చేస్తోంది.

బంగారు రెక్కల సీతాకోకచిలక

ప్రతిష్ఠాత్మకమైన మెట్‌గాలా 2024 ఎడిషన్‌ను న్యూయార్క్‌లోని 'మెట్రోపాలిటన్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్'లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెన్నిఫర్ లోపెజ్, సారా జెస్సికా, ఆలియా భట్, ఇషా అంబానీ, నటాషా పూనావాలా... మొదలైన ఎంతోమంది ప్రముఖులు పాల్గొన్నారు. మెట్ గాలా రెడ్ కార్పెట్‌పై కనిపించాలనేది ఎంతోమంది అమ్మాయిల కల. అయితే తొలి ప్రయత్నంలోనే ప్రేక్షకులు 'వావ్' అనుకునేలా చేసి, మెట్ గాలాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది పటేల్. 'ది గార్డెన్ ఆఫ్ టైమ్' థీమ్‌తో రూపొందించిన సీతాకోకచిలక ఆకారంలో ఉన్న గౌనుకు ఎంతోమంది ఫిదా అయ్యారు. 'నా వారసత్వాన్ని సెలబ్రేట్ చేసుకునేలా నా డెబ్యూ లుక్ ఉండాలనుకున్నాను' అంటుంది పటేల్. రెడ్ కార్పెట్‌పై పటేల్ బ్యూటీ లుక్ సోషల్ మీడియాలో వైరల్ సెన్సేషన్‌గా మారింది.

బ్యూటిప్స్

కనురెప్పల సోయగం...

- ఆర్టిఫీషియల్ ఐ లాషెస్‌తో కళ్లను మీనాల్లా మెరిపించవచ్చని తెలిసినాకూడా వాటిని ఎలా అమర్చుకోవాలో అర్థం కాక ఇబ్బంది పడుతుంటే... ఒకసారి ఇలా ట్రై చేయండి.
- ఆర్టిఫీషియల్ ఐ లాషెస్ (సౌందర్య సాధనాల మార్కెట్‌లో దొరుకుతాయి) ఒక సెట్, వాటిని అమర్చడానికి ఐలాష్ గ్లూ తీసుకోవాలి. వీటితోపాటు కత్తెర, ట్వీజర్, ఐ లాష్ కర్లర్, ఐ లైనర్, మస్కారా తీసుకోవాలి.
- ఆర్టిఫీషియల్ ఐ లాషెస్ మరీ పొడవుగా ఉన్నట్లనిపిస్తే తగినంత మేర ట్రిమ్ చేయాలి.
- ట్వీజర్ సహాయంతో లాషెస్‌కు గ్లూ పట్టించాలి. ఇప్పుడు వాటిని జాగ్రత్తగా కనురెప్పల మీద అమర్చాలి. గ్లూ ఆరి లాషెస్ సెట్ అయ్యే వరకు ఆగాలి. స్కిన్‌కు అంటుకోకుండా గ్లూవిడిగా ఆరిపోతున్నట్లు అనిపించినా, ఆరాక ఊడి వచ్చేటట్లు అనిపించినా కనురెప్పల మీద ఆర్టిఫీషియల్ లాషెస్ కరెక్ట్‌గా సెట్ అయ్యేటట్లు మెల్లగా నొక్కాలి.



- గ్లూ ఆరిన తర్వాత లాషెస్‌కు డార్క్ షేడ్ ఐ లైనర్ అప్లయ్ చేయాలి. ఇలా చేయడం వల్ల అసలు కనురెప్పలకు, ఆర్టిఫీషియల్ లాషెస్‌కు మధ్య తేడా కనిపించకుండా అంతా ఒకేలా ఉంటాయి.
- చివరగా ఐలాష్ కర్లర్‌తో వంపు తిప్పాలి. అవసరమనిపిస్తే (మరింతడార్క్‌గా కనిపించాలనుకుంటే) మస్కారా అప్లయ్ చేయాలి.

కోమలమైన పెదవుల కోసం...

- రోజూ ఉదయాన్నే బ్రష్ చేసిన తరువాత.. బ్రష్ మీద కొద్దిగా తేనె వేసి రెండు పెదవులపైన గుండ్రంగా ఐదు నిమిషాలపాటు రుద్దాలి. ఇలా రోజూ చేయడం వల్ల పెదవులపై పేరుకుపోయిన మృతకణాలు తొలగిపోతాయి. మర్దన వల్ల రక్తప్రసరణ సక్రమంగా జరిగి పెదవులు మృదువుగా మారతాయి.



- ఉదయం బ్రష్‌తో మర్దన చేసాక, రాత్రి పడుకునేముందు మాయిశ్చరైజర్ తప్పనిసరిగా రాయాలి. ఇందుకోసం.. కొద్దిగా బీట్‌రూట్ రసాన్ని వేడి చేయాలి. వేడిచేసిన రసంలో అర టీస్పూను కార్న్‌ఫ్లోర్ వేసి ఐదు నిమిషాలపాటు బాగా కలిపి దించేయాలి. తరువాత ఈ మిశ్రమంలో అర టీస్పూను గ్లిజరిన్, పావు టీస్పూను కొబ్బరి నూనె కలిపి ఎయిర్‌టైట్ కంటైనర్‌లో నిల్వచేయాలి. ఈ మిశ్రమం గట్టిపడిన తరువాత పెదవులకు రాసి మర్దన చేసి పడుకోవాలి. ఉదయం నీటితో కడిగేయాలి
- ఈ రెండింటిని ఒకదాని తరువాత ఒకటి క్రమం తప్పకుండా పాటిస్తే పెదవులు గులాబి రేకుల్లా కోమలంగా పింక్ కలర్‌లో ఆకర్షణీయంగా కనిపిస్తాయి.